# గురు వాక్యము

విద్వాన్ కవితిలక - కవితావిశారద కాంచనపల్లి - కనకాంబగారు

రాత్రి పదిగంటలైనది. రాచనగరులో గబగబలాడుచు దాసదాసీజనంబులు తిరుగుచున్నారు. సౌధోపరిభాగమునఁ జలువరాతి తిన్నెపైఁ గతిపయవైశ్వాసికజనపరివృతుండై మార్తాండవర్మ కూరుచుండియుండెను.

ఇప్పటికి నాల్గుజాములనుండి ప్రసవబాధ పడుచుండుటయే కాని పురుడు వచ్చుజాడ కానరాదయ్యె.

లోగిటనుండి వృద్ధదాసివచ్చి మహారాజు చెంతనున్న వృద్ధసేవకునితో నేమియో చెప్పిపోయినది. అతఁడు, పురోహితుని చెవిలో నూదెను. ఆ పురోహితుఁడు వటువుతో నేమో యనెను. ఆ బ్రహ్మచారి గంతువేసి పరుగెత్తిపోయెను.

మాటలు లేవు. నిశ్శబ్దముగా నిముసముసలు గడిచిపోవుచున్నవి. ఆమావాస్య చీకటి, ఆకసమునఁ గాఱుమబ్బులు, సన్నచినుకులు, ఉరుములు, మెఱుపులుగానున్నది.

"ధాం" అని పెద్దచప్పుడు వినఁబడినది. ఏమిదియని యెల్లరులికిపడిరి. వృద్ధసేవకుఁడు జయరాముఁడు "చిత్తము మహాప్రభూ! ప్రసవ మాలస్యమైనదని తల్లిగారు రౌంటరులను బిలిపించి జోడుతుపాకుల వేయించినారు. అదే చప్పుడు మఱేమియు లేదు. ఇంకను భగవంతుఁడు కన్నుఁ దెఱవలేదని చెప్పెను. రాజు శిరఃకంపముచేసి యూరకుండి యరుగుదిగి యిటునటుఁ బచారు చేయుచుండెను. దూరమునుండి జోడు కాగడాలు పైచికొని కొందఱు వచ్చుటఁ గాంచి,

"ఎవరు కాగడాలతో వచ్చువారు?"

జయరాముఁడు:—చిత్తము మహాప్రభూ! ముందు కాగడాలవెంట వచ్చువారు నలుగురును మంథెన ధర్మపురి ప్రాంతములనుండి వచ్చిన వేదపండితులు. రెండుమూడు దినములనుండి ఏలినవారి దర్శనమునకై వచ్చిపోవుచున్నారు. వారిసంగతి తెలిసి తల్లిగారు వారిని పిలిపించుమని పౌరోహితునితో గబురుచేసిరి. వారు మంచివారఁట, నాలుగణాలో ఆరణాలో యేమో చెప్పెదరఁట.

పురోహితుఁడు:—చిత్తము! -మహాప్రభూ! మంత్రప్రభావ మచింత్యము. ఇట్టి తరుణమున వరుణపారాయణ చేయించిన సుఖప్రసవము కలుగును. ఏలినవారి జననమునకుఁ బ్రశస్తమైన బ్రాహ్మణులచే వరుణపారాయణము పెద్దమహారాజుగారు చేయించిరి.

రాజు:—అటులైన—నా వెనుక వా రెవరు?

పురో:—జ్యోతిష్కులు క్రొత్తగా వచ్చినవారు. ప్రసవసమయమునకు జాతకచక్రమును వారిచేత లిఖింపఁజేయుడుమని నిన్న తమరు సెలవిచ్చితిరి కదా!

రాజు:—మంచిది.

కొంతసేపెల్లరు నూరకుండిరి.

## 2

ఉచ్చైస్స్వరముతో వరుణ పారాయణము వినఁబడుచున్నది. అందఱు నిశ్చేష్టితులై వినుచుండిరి.

ఇంతలో భగవంతుఁడు కన్ను దెఱచినాఁడు. మార్తాండవర్మకు మగపిల్లలు కవలు పుట్టినారు. రాజభవనమంతయు సంతోష కోలాహలముతో నిండియున్నది.

భూపతనము కాగానే వృద్ధదాసి పురిటింటిలోనుండి నిమ్మకాయ అయ్యవారిమీదికి విసిరి వేసినది. ఆయన యేదో వ్రేళ్లు లెక్కఁబెట్టుకొనుచున్నాఁడు. "ఒకరిద్దఱు బుల్లిబాబులు - మా బాబు లెంతవారు

కానున్నారో!" ఇంతలో నా జ్యోతిష్కుఁడు మంచి తేజోమూర్తి, మూర్తీభవించిన నిస్పృహ, యిటులనే వచ్చుచుండెను.

పురో:—అయ్యా! సిద్ధాంతిగారూ! రాకుమారుల భోగభాగ్యములు వివరించి మాకు సంతోషము కలిగించి మహారాజ సన్మానమును గైకొనుఁడు.

జ్యోతి:—అయ్యా వసిష్ఠులవారు! గురుకటాక్షముచే మాకు దోఁచినంతవఱకు నున్నది చెప్పువారము. జ్యోతిష్కులు యోగమును మూటగట్టుకొని వచ్చి పంచిపెట్టుదురని లోకు లనుకొందురు. మహారాజ కుమారు లాయుష్మంతులు, బాలారిష్టము లేవియు లేవు. చిరంజీవుల విషయము ప్రకృతము చూడఁదగిన దింతియే, చాలు నేను సెలవు పుచ్చుకొనెదను.

పురో:—అయ్యా! చూచుటకు మీరు పెద్దలుగా నున్నారు గాని, యాస్థానమరియాద నెఱిఁగియున్నట్లు తోఁపదు.

జ్యోతి:—నేనేమియు మరియాద మీఱి మాట్లాడలేదు. శుభమైన మాటయే చెప్పితిని. నేను నాపాటికీశ్వరుని నమ్మియుండువాఁడనే గాని రాజ సందర్శనము చేయరాలేదు. నా కాహ్వానమురాగా మహారాజుగారి మాట మన్నించి వచ్చినాఁడను. తోఁచిన మాట చెప్పితిని. గార్యాంతరమున్నది. మహారాజా విజయీభవ, నేఁబోయి వచ్చెద సెలవిండు.

మార్తాండవర్మ:—(తనలో) ఆహా ఏమి యీ బ్రాహ్మణుని దిట్టతనము! మహారాజు నేని సరకు సేయక మదిలో నున్నదున్నటులు సెప్పి నిస్పృహులై వెడలువారు కొందఱుందురు కాబోలు. (ప్రకాశముగ) సిద్ధాంతిగారూ! చిరంజీవుల మహారాజయోగములు, వారిపాండిత్య, ప్రతాపాదులు, శౌర్యగాంభీర్యాదులు, మీరు కీర్తింపలేదే యని మా పురోహితులవారి యభిప్రాయము.

జ్యోతి:—శుభమైనమాట చెప్పియే యున్నాను. నన్నేటికి ప్రతిబంధించెదరు. అబద్ధమైనను బ్రియమైన మాట వినుటయందు జనులు కుతూహలము గలిగి యుందురు. నిజమైనను హితమును వినఁగలవారు లేరు. కావున నెఱింగినవారలేని యర్థులకు గాని వేత్తలగువారికి హిత ముపదేశింపరాదు.

మార్తాం:—(తనలో) ఇతఁ డేమి చెప్పునో చూతము. (ప్రకాశముగ) సిద్ధాంతిగారూ! కలమాట వచింపుడు. నేను హితము కోరువాఁడనే, అనుగ్రహించి యున్నమాట సెలవిండు.

పురో:—మే మెఱుఁగనిదియు మీకే తెలియఁదగినదియు నగునదియే మా సత్యము. పెద్దలని మీ ముఖతః వినఁగోరుచున్నాము గాని తరతరములుగా నున్న పురోహితులము. చక్రము చేతులమీద నే యుండఁగా యోగములన్నియుఁ జెప్పి వేయఁగలము.

జ్యోతి:—మహారాజా! సాక్షాత్తు శ్రీరామచంద్రుని యంతవారు మీరు. వసిష్ఠునంతవారు మీ పురోహితులు. దాన మాకేమి? శబ్దప్రమాణావయం: మీ రడిగితిరి గానఁ జెప్పెదను. మీ యాగ్రహానుగ్రహములతో మాకేమియుఁ బనిలేదు. ఈరాజకుమారులలో జ్యేష్ఠుఁడు బుద్ధిలేనివాఁడు మూఢుండగును. రెండవవాఁడు చోరుండగును. ఏమహానీయుని యనుగ్రహమైనను గలిగిననాఁడే రెండుదోషములు పోయి యుభయులు సర్వలక్షణ సంపన్నులగుదురు. ఇదియును నిజము. పెద్దల సేవించి మహారాజా! కుమారులతోఁ గృతార్థుఁడవు కమ్ము.

పురో:—సిద్ధాంతిగారూ! మీది చూడఁగా తాచకమూచక మతమో రెట్టమతమో కావలయును. లేకున్న ప్రభు సమక్షమున నిట్లు చెప్పుదురా.

మార్తా:—వసిష్ఠులవారూ! మీ రూరకుండుఁడు. నా యభ్యర్థనముపై వారికిఁ దోఁచినమాట వారు చెప్పినారు. వారి నేమియు ననరాదు. స్వామీ! మీకిదే నమస్కారము. ఈ సత్కారమును గైకొని దయచేయుఁడు.

జ్యోతి:—మీ బహుమానములకు రాలేదు. అవి యన్నియు నట్లే యుండనిండు. నే నీ పండును దాంబూలమును మాత్రము తీసికొనిపోవుచున్నాను.

మార్తా:—చిత్తము నమస్కారము.

జ్యోతి:—సమస్త సన్మంగళానిభవంతు.

## 3

ఉపవనమందలి స్వచ్ఛమగు నీటితో నద్దమువలె ప్రకాశించుచుఁ జలువరాతి సోపానములతో గన్నులకింపు గూర్చు కోనేటియొద్దున సంధ్యాసమయంబున మలయమారుత సుఖపరవశుఁడై మార్తాండవర్మ కూర్చుండెను.

అతని పురోహితుండును మహారాజును వెదకుచు తోట నలుగడల గలయం జూచి వచ్చి దవ్వులనిల్వంబడి పలుకకుండెను.

కొంతసేపటికిఁ జెంతనున్నవానిం గనుంగొని రాజు "నమస్కారము! ఎంతసేపైనది మీరువచ్చి" యని యడిగెను.

పురో:—మహాప్రభూ! అరగంటసేపైనది. ఇంత నిశ్చలముగా దాముండుట యే నెన్నండెఱుంగను. సంధ్యాసమయంబగుట ధ్యాననిష్ఠలో నున్నారని భావించి మౌనంబున నిరీక్షించుచుంటిని.

మార్తా:—రామభట్టుగారూ! ధ్యానమా! అది యెంతటిమాట! మా బోంట్ల కెన్నటి కది సిద్ధించునో?

రామ:—మహాప్రభూ! భుజబలా నమిత సకల రాజన్య మండలుండగు మార్తాండ మహారాజున కేటి రాజ్యచింత.

మార్తా:—పెద్దల యాశీర్వచనంబున రాజ్యచింత లేకున్న పురాకృతకర్మపాకవశంబున సంసారచింత తప్పనిదియేకదా!

రామ:—ప్రభువుల నోటివెంట నిట్టి మాటలు రారాదు. ఏలినవారి కేమి లోపమున్నది? బాబుల విద్యాబుద్ధుల విషయమే కదా మీమదిలోని చింత. రాజమరియాద లెఱుఁగని పల్లెటూరి బాపనిమాటలు మీ రింతగాఁ బాటింపవచ్చునా? పులికడుపున మేక పుట్టునా? ఈపటికి కద చిరంజీవుల కైదవయేఁడు పుట్టుట. తగిన పండితులను మన యాస్థానములోని వారిని నియోగించిన దినదిన ప్రవర్ధమానులై చిరంజీవులు సకల కళాపరిపూర్ణులగుదురు చింతమానుఁడు.

మార్తాం:—రామభట్టుగారూ! ఈ విషయమున నన్ను మన్నింపుఁడు. చిరంజీవుల జనన సమయమునకు వచ్చిన సిద్ధాంతి మహనీయుఁడు నిస్పృహుఁడు. ఆ బ్రాహ్మణుఁడు తృణీకృత బ్రహ్మపురందరుఁడు. పరమాప్తుఁడు. ఆసపడి అబద్ధమాడువాఁడు కాఁడు. ఆయన లోకసామాన్యుఁడే యగునేని యందఱవలె శుభమైన వాక్యములు పలికి దండిగ మనబహుమానము లందుకొని పోయియుండును.

రామ:—చిత్తము మహారాజా! ఏలినవారిమాట కాదనను గాని నిస్పృహులవలెఁ గనఁబడు చాదస్తులు ఛాందసులలో బహువురు కలరు. అదుగో మహామంత్రిగారును నిటులనే వచ్చుచున్నారు. ఈ విషయమున వారి యభిప్రాయ మెట్లుండునో విచారింతము.

మార్తాం:—బాబుల విద్యాభ్యాసవిషయ మాలోచింపుఁడని నిన్ననే మంత్రిగారికి నేను సూచించియుంటిని. (మంత్రివైపు తిరిగి) అమాత్యశేఖరున కివే నమస్కృతులు. చిరంజీవుల విషయ మేమి నిర్ణయించితిరి.

మంత్రి:—మహాప్రభూ! ఏటి కీ చింత! విష్ణుశర్మయను మహానుభావుఁ డున్మార్గగాములైన రాకొమరులను సత్పథముం డుంచె నన్నమాట సత్యము కదా! బాబులు పసిపాపలు, ఎట్టి దుస్సహవాసములు, దుర్వాసనలు నెఱుఁగనివారు; మొక్క వంచవచ్చును గాని మ్రానును వంచనగునా? వెన్ను ముదిరిన రాజపుత్రులను వంచి వినీతులను బుద్ధిమంతులను జేయుట కవకాశముండగా నీ రాజకిశోరముల శిక్షించి విద్యాబుద్ధుల లలవఱచుట వింతయా? ఆ

పిచ్చిసిద్ధాంతి పెద్దబాబు మూఢుఁడగునని కదా వచించె. ఏ జ్యోతిశ్శాస్త్రమునుబట్టి రాకొమరున కీ మాఢ్యము నాతఁడు నిరూపించెనో ఆ జ్యోతిశ్శాస్త్ర మునే సమగ్రముగా సూర్యసిద్ధాంతము మొదలగు సద్గ్రంథములన్నియు బోధించి విద్వాంసుని జేసి సిద్ధాంతి సిద్ధాంతము నబద్ధము జేయవచ్చునని శిష్టు వారు చెప్పుచున్నారు.

రాము:—అది మాట.

మార్తా:—మంచిది:—చిన్నబాబు విషయమేమి?

మంత్రి:—చిత్తము మహాప్రభూ! ఆవిషయమున ధర్మాబొట్లుగా రొక యపూర్వమగు సుకుమార ప్రయోగమును సూచించినారు.

మార్తాం:—ఏమది?

మంత్రి:—పాతకరూపమగు చౌర్యముకదా చిరంజీవికుండా సిద్ధాంతిగా రారోపించినారు. ఇయ్యది ధర్మదోషమును వారించుట కొక నూతనధర్మశాస్త్రమును రచియించి లోకమునంగల వస్తుజాతమంతయు నిరూపించి ఈవస్తు వపహరించిన నీపాపము, నావస్తు వపహరించిన నా పాతకమని నిర్వచించి చిరంజీవి చేత జదివించిన దద్దోషపరిహారము కాఁగలదు. ఇది యొక దుష్కర కార్యము కాదని ధర్మబొట్లుగా రనుచున్నారు.

రామ:—మహాప్రభూ! ఈ యుపాయము సర్వోత్తమముగా నున్నది.

మార్తాం:—ఆప్తులు, పురోహితులు, మంత్రులు, నాస్థానవిద్వాంసులు మీరెల్లరు నా క్షేమముకోరి చెప్పినమాటలు విశ్వసింపక చేయదగిన కార్య మేమున్నది. అట్టేకానిండు. ఇంతకు జిరంజీవులకు విద్యాబుద్ధుల లలవడుటయేకదా మనకు బ్రధానము.

## 4

సచ్చిదానందనాథస్వామి యాశ్రమము ప్రశాంతముగ నున్నది. ప్రాతరనుష్ఠానానంతరము పారిజాతతరు మూలంబున నిర్మింపఁబడిన వేదికపై గూరుచుండి పుష్పతరుగుల్మంబుల రామణీయకంబు నానందనాథులు జూచుచు వినోదించుచుండిరి. తన కాల్యకృత్యములఁ దీర్చుకొని వచ్చిన శిష్యుఁ డొకడు వారికి యథావిధిగా నమస్కరించి చేతులు జోడించుకొని చెంత నిలువంబడియుండెను.

ఆనంద:—వత్సా! మార్తాండవర్మ నగరంబున నేమి విశేషములు? మీ తలిదండ్రులు సేమమా?

శిష్యు:—స్వామీ! మా తండ్రిగారి షష్టిపూర్తి కలాపమంతయు దమ యాశీః ప్రభావంబున నిర్విఘ్నముగా జరిగినది. మార్తాండ మహారాజుకుమారుల విద్యాప్రదర్శనము రేపు జరుగునట. మహావిద్వాంసులముందర, రాజకుమారుల విద్యాబుద్ధులు ప్రకటింతురఁట. ఒకఁడు జ్యోతిశ్శాస్త్ర పారంగతుడఁట. రెండవాఁడు ధర్మశాస్త్రవేత్తయఁట. ఈ రాజకుమారులకన్న మిన్నలగువారు లేరని వారి శిక్షాగురువులగు పండితులు ప్రగల్భములు గొట్టుచున్నారు.

సచ్చి:—అంద రేమనుకొనుచున్నారు.

శిష్యు:—ఊరివారిందఱు రాజకుమారుల బుద్ధికుశలతను వారిని శిక్షించి తీర్చిన యాచార్యుల వైదుష్యమును రేపు చూచి సంతసింతుమని యువ్విళ్లూరుచున్నారు కాని—

సచ్చి:—ఏమది?

శిష్యు:—మా అమ్మగారు రహస్యముగ నాతో నిట్లు చెప్పినది. ఈ రాకొమరుల జననమున నొక్క మహానుభావుఁడు వచ్చి వీ రిరువురిలో నొకఁడు మూఢుఁడనియు, రెండవాఁడు తస్కరుఁడగుననియు చెప్పిపోయెను. ఈకుమారులు పండితులైరి. అమ్మహానీయునిమాట తప్పునది కాదు. ఇది యెట్లు ఘటించునో మనకేల? యీ మాటల నెచ్చటను ననవలదని.

ఆమాట విని గురుస్వామి నవ్వి "మంచిది. నీవు పోయి నీపనులు చూచుకొనుచుండుము."

## 5

మఱునాఁడుదయమున నెనిమిది గంటలగువరకు రాజసభ కిటకిటలాడుచుఁ బండితులతోఁ బౌరులతో వివిధవిద్యార్థులతో వినోదము చూడవచ్చినవారితో నిండిపోయినది. మార్తాండవర్మ వచ్చి సభలో నున్న బ్రాహ్మణబృందమునకు నమస్కరించి సింహాసనాసీనుఁ డయ్యెను.

ఆస్థానపురోహితుఁడు లేచి "మహాప్రభూ! విద్వన్మణులారా! మహారాజకుమారులకు విద్యాపరిపూర్తి యైనది. నేను చిరంజీవుల విద్యా వైదుష్యములను సద్గుణసంపదయుఁ జూచి సదస్యులెల్లరు పరమానందమును బొందుదురుగాక. మా రాజకిశోరముల కీర్తి దిగంతములయందు వ్యాపింపఁగలదు. ఇమ్మహాసభలో నెవ్వరేని జ్యోతిశ్శాస్త్రమునం దేభావముననైనను బ్రశ్నింపుఁడు" అనెను. అంత సభాసదులలో నొకవైపున గూర్చుంటిన యొక తేజోవంతుఁడు లేచి "ప్రశ్నభాగమున నడుగుచున్నాను. నా గుప్పెడులో నున్న దేదియో మహారాజకుమారుఁడు చెప్పఁగలఁడా?" అనెను.

పురో:—ఎవరయా నీవు? ఇదియేమి ప్రశ్న! రాజసన్నిధానమునందు నీ వెవ్వరో తెలియపఱచకుండ నిట్లు ప్రశ్న నడుగవచ్చునా?

పండి:—ఎవరైన నడుగవచ్చునని మీ రంటిరి కాన నే నడిగితిని. తప్పేమి? రాజకుమారుఁడు దీనినిఁ జెప్పలేకపోయిన చప్పలేఁడని మీ రొప్పకొనుఁడు.

పురో:—భద్రము! సూర్యసిద్ధాంతాది సకల గ్రంథములు చదివిన మహారాజ కిశోరమున కీ ప్రశ్న లెక్కయే.

పండి:—ఒక సూర్యసిద్ధాంతము కాదు, పంద్రెండు సూర్యసిద్ధాంతములు చదివినను రాజకుమారుఁడు నా ప్రశ్నకు సమాధానమును జెప్పలేఁడు.

సభలో పెద్ద కోలాహలము జరిగెను.

పండి:—పుట్టబోవు బిడ్డలకు పేరు లేల పెట్టెదవు? చేతనైన సమాధానమును జెప్పుమనుఁడు!

మార్తాం:—అయ్యా! మీ రెవరో మీ కొకనమస్కారము. మీరడిగిన ప్రశ్నకు చిరంజీవి సమాధానము చెప్పుటయే కదా మీకుఁ గావలసినది.

పండి:—చెప్పలేఁడని నా యభిప్రాయము. చెప్పిన సంతోషము. నా జ్యోతిషమో! ఆయన జ్యోతిషమో ఇప్పుడే తేలఁగలదు.

పురో:—మహారాజకుమారా! వేగమే తగు సమాధానము చెప్పి యీ దురహంకార పండితుని నోరు మూయింపుము.

పండి:—మీ మాటలు మీకే! మీకు మీ రాజాశ్రయము బలము మాకు సర్వత్ర పాండిత్యము బలము. నేఁడీ గొప్పసభలో నెట్టి పరాభవమగునో యని మార్తాండవర్మ వెలవెల పోవుచున్నాఁడు.

"ఈ నూత్నపండితుఁ డెవఁడో! ఈతనిఁ జూచిన నాకు భయమగుచున్నది. ఈతనియందుఁ జిరంజీవుల జననవేళ వచ్చిన సిద్ధాంతికళ గానవచ్చుచున్నది. ఆ వేషభాషలు—నా నిస్పృహత సామాన్యులయందుఁ గానరా" దనుచు రాజు యోజించుచుండఁగాఁ బురోహితుని ప్రోత్సాహంబున మహారాజకుమారుఁడు లేచి "నాన్నోయి! ఆయన యడిగినదానికి నేనే చెప్తా. మళ్లీ అడగమను" అనెను.

తన కుమారుని జానపదత్వ ముగ్ధత్వంబులకు మహారాజు సిగ్గుపడి తలవంచుకొని "యెన్నితీరుల బోధించినను చిన్నవాఁడు సమయము వచ్చువఱకు సభాయోగ్యమైన ప్రసంగము చేయఁజాలక కేవల గ్రామ్యవాక్కు పల్కి నాకు తలవంపులు తెచ్చినాఁడు" అనుకొనెను.

తక్కిన సదస్యులు "అలంకార విద్యార్థియన నిట్లుండవలదే" అనుకొనిరి.

పండి:—మహారాజకుమారా! నా గుప్పెటనున్న దేమి చెప్పుము.

రాజకు:—మ-హా-రా-జ-కు-మా-రా — నా-గు-ప్పె-ట-ను-న్న-దే-మి-చెప్పుము—” అనుచు నొక్కొక్క యక్కరమే విడివిడిగా వికారముగాఁ బలుకుచు, వ్రేళ్లు లెక్కబెట్టుకొనుచుఁ, గొంతతడ వాలోచించి సభను కలయంగనుఁగొని “ఇదిగో ఆయన చేతిలో నేముందో చెప్తా చూస్కోండి” అనెను. పురోహితుఁడు నిశ్చేష్టుఁడైనాఁడు. కొంత వడికి తెప్పరిల్లి “నాయనగారు సెలవిచ్చుచున్నారు వినండి” అనెను. అందఱు నిరీక్షించుచున్నారు.

రాజకు:—చూస్కోండి ఆయనచేతిలో బండి ఉన్నది. సభలో నా మాట పిడుగుపడినట్లైనది. మార్తాండవర్మ విసంజ్ఞుఁడయ్యెను.

“పండితునిచేతఁ బండిచక్రముండునా? శాస్త్రము నిజము గావున రాజకుమారుని లెక్కప్రకార మొక వలయాకారముగల వస్తువు నాచేతనున్నట్లు తేలినది. వలయాకారముగల వస్తువుంగరమో! కాసో యని చెప్పరాదా! అట్లు చెప్పనలవికాదు. పెద్దలు వీఁడు మూఢుఁడౌనని చెప్పిన మాటలు నిజముగా వీఁడింత చదివియుఁ జివరకు ఫలకాలమున బుద్ధి విపరీతమై చేత బండిచక్ర మున్నదన్నాఁడు. ఇందలి నిజమిది. రెండవవాని ధర్మశాస్త్రముకూడ నిట్లే తేలకలదు పిలిపింపుఁడు.” అని పండితుడు సభలో నఱచెను.

పురోహితుఁడు:—అయ్యా! తొందరపడకుఁడు. పిలిపించెదను.

ఇంతలో దౌవారికుఁ డొకఁడు పెద్దమూటతో నొక్క మనిషిని దీసికొని రాజసభను బ్రవేశించి “మహాప్రభూ! నేడు తెల్లవారుజామున దివాణమున దొంగ బ్రవేశించినాఁడని విన్నవించుకొంటిని. వానిని గవనివాకిటనుంచి యెనిమిది గంటలకు దర్బారుహాలులో హాజరుపెట్టమని సెలవిచ్చితిరి. వాని నిటకు దీసికొని వచ్చితిని.”

మార్తాం:—(తనలో) పరమేశ్వరా బ్రదికించితివి. (ప్రకాశముగ) ఎవ్వఁడీ దొంగ.

దౌవా:—ఎవఁడో తెలియదు. చీకటిలోఁ జిక్కినాఁడు. కొట్టినను దిట్టినను మాటలాడఁడు. మొగమున ముసుగు దీయఁడు.

మార్తాం:—ఎవఁడవురా నీవు! దివాణములో దొంగతనము చేయ సాహసించితివిగా! వీఁడు దొంగిలిన పదార్థమేమి? మూటవిప్పుఁడు.

ఎన్నియో పీటముళ్లు విప్పఁగా విప్పఁగా బయలు పడిన పదార్థము రెండు మానికలయూక. సభవారాశ్చర్యపడి ఊక రాజభవనమున దొంగిలించు వెఱ్ఱివాఁడుండునా? యని యచ్చెరువందుచుండిరి.

పండి:—సభ్యులారా! ఏల సంశయించెదరు! ఈ “యూకదొంగ” రెండవరాజకుమారుఁడే సందేహము లేదు. ఇదిగో చూడుడని తనయున్నచోటి నుండి లేచి యీ దొంగ యొద్దకు గంతువేసి వచ్చెను.

సిద్ధాంతి:—ఇక నీ మరియాద దక్కదు. మహాప్రభూ! యిఁక వీని మన్నింపరాదు.

మార్తా:—బ్రాహ్మణుండని, పండితుండని మన్నించినందుకు హద్దుమీరిపోవుచున్నాఁడీ పాలుఁడు. ఎవఁడురా! ఈ బాపని శిరచ్ఛేదము చేయింపుఁడు.

పండి:—కాఁగలకార్యము గంధర్వులే కావించిరి. మహారాజా! ఇదిగో నీ యహంకారమే నీకు శిరచ్ఛేదము చేయుచున్నది. చూడుమని యా దొంగను బట్టుకొని ముఖవస్త్రమును దీసి పాఱవైచెను. రాజుగారి రెండవకుమారుఁడు బయలుపడెను.

మార్తాం:—ఆవలఁ బినట్లుఱచి సింహాసనమునఁ బడి మూర్ఛిల్లెను.

ఉపా:—(రాజకుమారునిఁజూచి) నీకుఁ జెప్పిన ధర్మశాస్త్ర మెక్కడఁ దగులఁబెట్టితివిరా తండ్రీ!

రాజకు:—ఊకను శ్లోకము రాశావూ నీవు. రాయలేదు గాదూ! అందుకని ఊక ఎత్తుకొచ్చా! నన్నంటావేం?

సభలో పెద్దకోలాహలము, ఆస్థానపండితుని, క్రొత్తపండితుని చుట్టుముట్టిరెల్లరు.

మంత్రి యీ యపాయమును దప్పించు నుపాయము కానక దాను సాహసించి సేనానిని బిలిచి "సేనానీ! రాజకుమారు నంతఃపురమున కొక భటునితో నంపి వేయుము. లోగిటలో భయకారణ మేమియు లేదు. అంతయు శుభమే యని— నా మాటగా కబురు చేయుము. ఆ క్రొత్త పండితు నొక్కనిమాత్ర ముంచి తక్కినవారు వారు వీరనక యెల్లరను దర్బారునుండి వెంటనే సెలవిచ్చి పంపివేసి నిర్మక్షికముగా నొనరింపుము.

ఒక్క నిముసములో సభాభవనము నిర్మానుష్య మయ్యెను. తలుపులు మంత్రి స్వయముగా మూసి వచ్చి క్రొత్తపండితునికి మ్రొక్కి "మహానుభావా! నీ వెవ్వఁడవో! బ్రహ్మవిదుఁడవో! సిద్ధుఁడవో! రాజకుమారుల జననమునకు వచ్చి సిద్ధాంతివో! లేక యాతని శిష్యుఁడవో నీ వెవ్వఁడవైన నేమి? నీకు నే నమస్కరింతు. సర్వాపరాధముల మన్నించి, మా మహారాజకుటుంబము నీవిపత్సముద్రమునుండి బయటఁ బడవేయుము. తరుణమున దరుణోపాయము నీ కరుణయే గాని వేఱొండులేదు" అని విన్నవించెను.

పండి:— అమాత్యశేఖరా! నీ మహారాజునకు నీకు శుభంబయ్యెడు చింతనొందకుము. మహనీయుల మాట పాటిచేయక యిచ్చకములాడు నాశ్రితులను నమ్మి యీ మహారాజిట్టి యాపద తెచ్చుకొన్నాఁడు. "పశ్చాత్తాపేన శుద్ధ్యతి."

మార్తాండమహారాజు కన్నులు తెఱచి చూచి తెప్పఱిల్లి "నే నింక ప్రజలమొగము చూడలేను. ఆ సిద్ధాంతి మహనీయుఁడు. అతని నిస్పృహ నా మనంబున హత్తిపాయకున్నది. ఈ పండితునియందును వానిజాడ కానవచ్చుచున్నది. మంత్రీ! ఈ రాజ్యమును భద్రముగాఁ జూచుకొనుచుండుము. చిరంజీవులతో నే నమ్మహనీయుని దర్శింపబోయెద. ఆ ఘనుని కటాక్షమున నంతయుఁ జక్కఁబడఁగలదు" అని యుద్రేకముతో నాగియాగి పలుకుచు పండితునివైపునకు దిరిగి "స్వామీ! మీ స్వరూపప్రభావము లేమి! మీ రెచ్చట నుందురు? మీ సాహాయ్యంబున నాకు మహనీయుల దర్శనము లభింపఁగలదని తోచుచున్నది. అహంకార పరవశుండనైన నే నన్నమాట క్షమింపుఁడు.

పండి:— నన్నును మీరు మన్నింపుఁడు. నేను గుర్వాజ్ఞానుసారముగా మీ సభలోఁ బ్రవేశించి వారి యాజ్ఞను నిర్వహించి మీకు స్వస్వరూపమును నిరూపణ మొనరించితినే గాని నా యహంకారమువలననే మాటాడినవాఁడనుగాను.

మార్తాం:— మీ గురువు లెవరు?

పండి:— మీ యీ రాజధానీ పరిసరంబులనున్న నది కవ్వలితీరంబున నాశ్రమము కల్పించుకొని నేటికిఁ బదునారేడులుగా దపం బొనరించుచున్న సచ్చిదానందనాథస్వామివారు వారి యాశ్రమమున వసించు వారి శిష్యులలో నే నొకఁడను.

మార్తా:— స్వామీ! నా యపరాధములను మన్నింపుఁడు. ఇంతకాలము వారు మా నగర సమీపమున నున్నను వారి దర్శనము జేయనైతిని. అమ్మహనీయుఁడు బ్రహ్మణ్యుండు గానోపు. నన్నాతని సమీపమునకు దోడ్కొనిపొండు.

పండి:— గురుకటాక్షము మీపై నింతకుమున్నే ప్రసరించియున్నది. మీరు నిర్విచారముగ నుండుఁడు.

అంత నానాఁడు దినశేషమెట్లో గడిపి ఆ రాత్రి వేగుటయు ప్రత్యుషస్సున బయలువెడలి మార్తాండవర్మయుఁ, బండితుఁడును, రాజకుమారు లిద్దఱును, సచ్చిదానందనాథుని యాశ్రమముఁజేరి కాల్యకృత్యములు నిర్వర్తించుకొని మహానుభావుని దర్శనము కొఱకు నిరీక్షించుకొనియుండిరి.

ఎనిమిదిగంటలకు నానందనాథులు బయటికి వచ్చిరి.

మార్తాండవర్మ సపరివారముగా సాష్టాంగనమస్కారము చేసి నిలువంబడియుండెను.

ఆనం:—మహారాజా నీవు ధన్యుఁడవు. గతంబునకు వగవకుము. నీ కుమారుల నిచ్చట విడిచి నీవును నీ మంత్రియు నిశ్చింతముగా నగరమునకు బోయి మీ రాజ్యపరిపాలనము సేమముగ నుండుఁడు. భగవత్కృపవలన మీ సభ్యుల కందఱకు నిన్నటి సభా వృత్తాంతము విస్మృతంబయ్యెడు. మీరును దుస్స్వప్నము వలె వెనుకటి చరిత్రను మఱచిపొండు. ఆరుమాసము లైన వెనుక తిరిగిరండు.

మార్తాండవర్మ హర్షసలిలపూరితనేత్రుఁడును బులకితగాత్రుండునై, "సర్వము మీ యనుగ్రహము. ఈ కుమారుల గరుణింపుఁడు" అని మిన్నకుండెను.

ఆనంద:—రాజా! నీవమాయకుఁడవు. పరివారము యొక్క దోషమున నీ సహజమగు గుణములు తిరోధానము చెందినవి. ఆనాటి సిద్ధాంతియే యీ రూపమున నీయందున్న వాత్సల్యముచే నీ యాశ్రమంబునఁ దపం బొనరించుకొనుచున్నాఁడు. పరమేశ్వర కటాక్షంబున సర్వము చక్కబడఁగలదు.

చిత్తమని రాజును మంత్రియు సెలవుగైకొని నిజ రాజధానికి వెడలిపోయిరి. రాజకుమారు లిద్దఱు కానాఁడే సచ్చిదానందస్వామి మంత్రోపదేశము చేసి వారల శిరంబున హస్తముంచి యాశీర్వదించుచు నిట్లు పలికెను.

క. జీవుల కెవ్విధి తెలుప? స్వ
భావోదురతిక్రమయని ప్రాజ్ఞులు పల్కన్
శ్రీవల్లభ నీదయయే
గావలె వేఱొండు త్రిప్పఁగలదా మనమున్.

## 6

దినదిన ప్రవర్ధమానులై యా రాజకుమారులు విశ్వామిత్రముని సన్నిధానమున నున్న రామలక్ష్మణులవలె సకలకలాపరిపూర్ణులైరి. సకల వేదవేదాంగములయందును, ధనుర్వేదమునందు, రాజ్యాంగముల యందుఁ జతుష్షష్టి కళలయందు మంత్రములందు, యోగమందు బూర్ణాధికారులైరి.

ఆరుమాసముల గడువెప్పుడు తీరునాయని కాచుకొనియున్న రాజు గడువు తీరగానే రాజధాని వెడలి ఆనందనాథుని యాశ్రమమునకు వచ్చి సకలకలాపరిపూర్ణులైన కుమారులఁగాంచి యపరిమితానందభరితుఁడై గురువునకు నమస్కరించి యిట్లనియె.

మార్తాం:—స్వామీ! నేను మీవాఁడను. నన్ను మీ కైంకర్యమునకుంచి యీ కుమారుని రాజ్యమునకభిషిక్తుం గావింప బంపుడు. నేను భార్యాసహితుండనై మీ పరిచర్యసేయుచుఁ దపం బొనరించుకొందును.

ఆమాట విని యానందస్వామి "రాజా! నీవు ధన్యుడవు. ఈనాటితో నీవు కృతార్థుఁడవైతివి, పో! నీ యభిమతము చెల్లుంగాక" యని మంత్రినిఁ బిలిపించి, యీ రాకొమరుల నొప్పగించి రాజధానికిఁ బంపివేసెను.

రాజధానిలో సమస్తమగు రాజమర్యాదలతో రాజకుమారుని పట్టాభిషేక మహోత్సవము జరిగినది. ఆనందనాథాశ్రమములో సదాతత్త్వ విచారణముతో భక్తబృందము బ్రహ్మానందము ననుభవించుచున్నది.

గీ. తానహంకరించి తనయునకే విద్దె
బుద్ధికూర్పలేఁడు భూవిభుండు
మస్తకమున గురుఁడు హస్తంబు నిడనెట్టి
పామరుండునగును బండితుండు.